సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



మూడు తోవల పోతున్నరు!

అసెంబ్లీ ఎన్నికల వేళ ఏ ఊళ్లో చూసినా రచ్చ బండ ముచ్చట్లే నడుస్తున్నాయి. ప్రలోభా లకు లొంగకుండా పనిచేసే నాయకుడికే ఓటేయా లని చర్చించుకుంటున్నారు.

IIలో▸



తెల్లబంగారం ఇంటికి చేరేనా?

పత్తి సేకరణకు కూలీలు దొరకడం లేదు. రైతులు మహారాష్ట్ర కూలీలను పిలిపించుకుం టున్నారు. వారికి అధికంగా కూలి చెల్లించి పత్తి సేకరించుకుంటున్నారు.

IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/21.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

టీబీ అధికారిగా సాయిప్రియ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా క్షయ (టీబీ) అధికా రిగా సాయిప్రియకు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథో డ్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆమె టీబీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఇదివరకు జిల్లా టీబీ అధికారిగా పనిచేసిన డా క్టర్ శ్రీకాంత్ ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ఆయన విధుల నుంచి రిలీవ్ కాగా ఆ స్థానంలో సాయిప్రియకు బాధ్యతలు అప్పగించారు.

పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో ఖాళీగా ఉన్న పీజీ ఎంకామ్ (జనరల్), ఎంఏ (ఎక నామిక్స్) కోర్సుల్లో విద్యార్థులు తక్షణ ప్రవేశా లు (స్పాట్ అడ్మిషన్లు) పొందవచ్చని ప్రిన్సిపా ల్ డాక్టర్ జలగం అనిత గురువారం ఓ ప్రక టనలో తెలిపారు. సీపీగెట్ లేకున్నా డిగ్రీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈనెల 25లోపు కళాశాలలో ప్రవేశాలు పొంద వచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలని, పూర్తి వివరాలకు కో ఆర్డినేటర్ కే చంద్రకాంత్‌ను 9949685090 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సత్యనారాయణరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని విద్యానగర్ ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాల, బాలాజీనగర్‌లోని ప్రాథమిక పాఠశాల, యూపీఎస్ ఎన్జీవో, గజిటెడ్ పాఠశా లలను సందర్శించారు. ఉన్నతి కార్యక్రమం అమలు గురించి ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. పదో తరగతి విద్యా ర్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వందశాతం ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట సీసీ రాజేశ్వర్ తదితరులున్నారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ తనిఖీ



వాహన తనిఖీని పరిశీలిస్తున్న హిమశ్రీ

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర రహదారి చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ గురువారం తనిఖీ చేశారు. వాహనాల తనిఖీని పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. అక్రమంగా మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ఎక్సైజ్ సీఐ రాజమౌళి, సిబ్బంది ఉన్నారు.

మూడోరోజుకూ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

కైలాస్‌నగర్: వయోవృద్ధులు, దివ్యాంగులు ఇం టి వద్దే ఓటు వినియోగించుకోవాలనే ఉద్దేశం తో ఎన్నికల సంఘం చేపట్టిన హోంపోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మూడోరోజైన గురు వారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో 27మం ది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందు లో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు 19మంది, దివ్యాంగులు ఎనిమిది మంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కాకడ హారతి



పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్: కార్తీక మాసాన్ని పురస్కరించు కుని జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో గురువారం భక్తి శ్రద్ధలతో కాకడ హారతి నిర్వ హించారు. ఈ సందర్భంగా మఠాధిపతి యోగానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ గోవింద హరే మురారి.. అం టూ భక్తుల నామస్మరణ, భజనలు, సంకీర్తన లతో ఆలయం మార్మోగింది. భక్తులతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ తదితరులు పూజలకు హాజరయ్యారు.



డీసీసీ పీఠం ఎవరికో!

- ఆదిలాబాద్ సీటు ఆశించిన సాజిద్
- 'కంది'కే టికెట్ ఇచ్చిన అధిష్టానం
- పార్టీకి రాజీనామా చేసిన డీసీసీ చైర్మన్
- ఇక్కడ అధ్యక్ష పదవి దక్కేదెవరికో?
- నిర్మల్ బరిలో చైర్మన్ శ్రీహరిరావు
- ఎన్నికల తర్వాత ఇతడు కొనసాగేనా?

సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికల ప్రక్రియలో జరిగిన వివిధ పరిణామాల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష స్థానాలు ఖాళీ అయ్యాయి. కొన్నిచోట్ల అధ్యక్షులు అసెంబ్లీ బరిలో నిలవడంతో ఆయా చోట్ల కొత్తవారి నియామకంపై అధిష్టానం దృష్టి సారించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కొత్త అధ్యక్షులను నియమించే అవకాశాలున్నా యని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ఇప్పటికిప్పుడే నియమిస్తారా? లేదా.. ఎన్నికల తర్వాత నియమిస్తారా? అనే దానిపై స్పష్టత లేదు.

ఆయా జిల్లాల్లో ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా సాజిద్‌ఖాన్ ఇటీ వలి వరకు కొనసాగారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఆయన టికెట్ ఆశించారు. తనకు లేదా టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాతకు లేదా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సం జీవ్‌రెడ్డిలో ఎవరికో ఒకరికి టికెట్ ఇవ్వాలని అధిష్టా నాన్ని కోరారు. అయితే పార్టీ కంది శ్రీనివాసరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో వారు ముగ్గురూ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అం తేకాకుండా సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత స్వతంత్ర అభ్యర్థిగా సంజీవ్‌రెడ్డిని బరిలోకి దింపారు. ఈ నేప థ్యంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్ష స్థానం ఖాళీ అయ్యింది. నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా శ్రీహరిరావు కొనసాగుతుండగా, ఆయనను నిర్మల్ నియోజకవ ర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా అధిష్టానం బరిలోకి దిం పింది. ఈ నేపథ్యంలో అక్కడ కూడా అధ్యక్ష పీఠా న్ని మరొకరికి కట్టబెట్టవచ్చని పార్టీ వర్గాలు అభిప్రా యపడుతున్నాయి. మంచిర్యాలలో డీసీసీ అధ్యక్షు రాలిగా కే సురేఖ కొనసాగుతున్నారు. మంచిర్యాల అభ్యర్థి కే ప్రేమ్‌సాగర్‌రావుకు సతీమణి అయిన ఆమె ఎన్నికల బరిలో లేకపోవడంతో ఆమెనే అధ్య క్షురాలిగా కొనసాగించనున్నారు. కుమురంభీం ఆసి ఫాబాద్ జిల్లాలో విశ్వప్రసాద్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన కూడా ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఆ జిల్లా అధ్యక్షుడిగా ఆయ ననే కొనసాగించనున్నారు.

ముందుకు రాని నేతలు

కాంగ్రెస్ అధ్యక్ష పదవి విషయంలో ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికైతే ఆశావహు లు ఎవరూ బయటకు రావడం లేదు. దీం తో పార్టీ అధిష్టానం ఎవరి వైపు దృష్టి సారిస్తుందో ఆసక్తికరమే. జిల్లాలో పలువురు సీనియర్ నాయకులు కాంగ్రె స్‌లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆచీతూచి నిర్ణయం తీసుకునే అవ కాశాలున్నాయి. ఆదిలాబాద్‌లో గత కొన్నే ళ్లుగా సాజిద్‌ఖాన్ పార్టీ అధ్యక్షుడిగా కొన సాగుతూ.. జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల్లో టికెట్ దక్కని నేప థ్యంలో ఆయన పార్టీని వీడారు. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన వెంటే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయనేది ఆసక్తి కరం. పార్టీ అధిష్టానం ఇప్పటికిప్పుడే డీసీసీ అధ్యక్షుడిని నియమించాలని అను కుంటుందా..? లేదా.. ఎన్నికల అనం తరమే ఈ ప్రక్రియ చేపడుతుందా? అనేది వేచిచూడాల్సిందే.

విద్య, వైద్యం, సాగునీటికి పెద్దపీట

- గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తా
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మరు
- 'సాక్షి'తో బీజేపీ బోథ్ అభ్యర్థి 'సోయం'

ఇచ్చోడ: 'బోథ్ నియోజకవర్గ ప్రజలకు విద్య, వైద్యం, సాగునీరు అందించేం దుకు కృషి చేస్తా. మారుమూల గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మా ణానికి పెద్దపీట వేస్తా. అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత బీజేపీదే. తొమ్మిదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్, అంత కన్నా ముందు పదేళ్లు పాలించిన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గానికి చేసిందేమీలేదు' అని బీజేపీ బోథ్ అభ్యర్థి, ఎంపీ సోయం బాపూరావు పేర్కొ న్నారు. గురువారం ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇం టర్వ్యూలో మరిన్ని అంశాలపై మాట్లాడారు.

సాక్షి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవ కాశం ఉందా?

సోయం: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ టం ఖాయం. బీజేపీ ప్రభుత్వం రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారు.

సాక్షి: ఎన్నికల్లో గెలిస్తే నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారు?

సోయం: నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తా. నియోజకవ ర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తా. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తా.



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

సాక్షి: పార్లమెంట్ సభ్యుడిగా బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారు?

సోయం: పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన తర్వాత రెండేళ్లు కరోనా కారణంగా కొన్ని ఇబ్బందులేర్ప డ్డాయి. అయినప్పటికీ బోథ్ నియోజకవర్గ అభివృ ద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించా. అనేక గ్రామాలకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద బీటీ రోడ్లు వేశాను.

సాక్షి: ప్రస్తుతం యువత ఏం కోరుకుంటోంది?

సోయం: యువత బీజేపీ కావాలని, డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని కోరుకుంటోంది. అందులో భాగంగానే యువకులు అధికసంఖ్యలో బీజేపీలో స్వచ్ఛందంగా చేరుతున్నారు.

సాక్షి: యువతకు మీరిచ్చే హామీలేమిటి?

సోయం: బీజేపీ అధికారంలోకి రాగానే యూపీ ఎస్సీ తరహాలో ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ప్రతీ సంవత్సరం ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తాం.

ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

కైలాస్‌నగర్: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సూక్ష్మ పరిశీలకులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం లో సాధారణ పరిశీలకుడు నితిన్ కే పాటిల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలోని ప్రతీ అంశంపై సూక్ష్మ పరిశీలకులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలింగ్‌కు ముందు, తర్వాత ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. మాక్ పోల్ నిర్వహణ సమయంలో ఏజెంట్లు ఎంతమంది వచ్చారో సరిచూసుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా 50ఓట్లతో మాక్ పోల్ నిర్వహించాలని సూచించారు. ఏజెంట్ల సలహాలు, సూచనలు నోట్ చేసుకుని సాధారణ పరిశీలకులకు తెలియజేయాలని పేర్కొన్నారు. మాక్‌పోల్ అనం తరం ఓట్లను క్లియర్ చేసేందుకు క్లియర్ బటన్ నొక్కాలని, అనంతరం ఈవీఎంలను సీజ్ చేసి రిసె ప్షన్ కేంద్రంలో అందజేయాలని వివరించారు. అం తకుముందు మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ మైక్రో అబ్జర్వ ర్లకు శిక్షణ ఇచ్చి వారి సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఆదిలాబాద్, బోథ్ మైక్రో అబ్జర్వర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అంటరాని వాళ్లుగా చూడొద్దు'

తలమడుగు: ఎయిడ్స్ రోగులను అంటరానివారిగా చూడొద్దని ప్రాజెక్ట్ మేనేజర్ భాను సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థు లకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా భాను మాట్లాడుతూ.. ఎయిడ్స్ రోగులపై ప్రేమ చూపి వారు మానసికంగా ఆరోగ్యవంతు లుగా మారేందుకు దోహదపడాలన్నారు. అక్రమ సంబంధాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం స్టేట్ ఎయిడ్స్ సొసైటీ వారు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవ రావు, ఎన్ఎస్ఎస్ పీవో లింగన్న, అధ్యాపకులు ర మేశ్, సూర్యకాంత్, పాపయ్య, సచిన్‌కుమార్, రమా దేవి, కృష్ణ, మహేశ్, దినేశ్, రవికాంత్, సొసైటీ జీఎస్ఎం రాధిక, లలిత, విద్యార్థులున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భాను

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైన్స్‌లను తొలగించాలి

బేల: మండలకేంద్రంలోని నిబంధనలకు విరుద్ధం గా ఉన్న వైన్స్‌లను తొలగించాలని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్య క్షుడు ఆడ శంకర్ డిమాండ్ చేశారు. గురువారం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైన్స్‌ల ఎదుట మైనార్టీలు చేపట్టిన నిరసనలో వారు మద్ద తుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. జాతీయ రహదారికి 220 మీటర్ల దూరం లో ఉండాల్సిన వైన్స్‌లు 120మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటికి సమీప ప్రాం తంలో ఎస్టీ బాలుర ఆశ్రమోన్నత, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలున్నాయని పేర్కొన్నారు. పక్కనే ఉన్న ఈద్గాలో మందుబాబులు మద్యం సీసాలు పడేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలోని రోడ్డు మార్గంలో రాకపోకలకు బాలికలు, మహిళ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వైన్స్‌లను వెంటనే తొలగిం చాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. నిరసనలో మైనార్టీ మతపెద్ద అక్తర్‌ఖాన్, యువకులు పాల్గొన్నారు.



వైన్స్ దారి మూసివేస్తున్న మైనార్టీలు, బాధితులు

శ్యామ్‌బాబా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



వాహనంపై శ్యామ్‌బాబా విగ్రహం

కార్తీక మాసంలో తొలి ఏకదాశిని పురస్కరించుకుని శ్రీశ్యామ్ మిత్ర మండల్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో శ్రీశ్యామ్‌బాబా జన్మోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ శోభాయాత్ర చేపట్టారు. శ్యామ్‌బాబా ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరిం చిన వాహనంలో ఊరేగించారు. వాహనం ముందు భక్తులు జెండా లతో నృత్యాలు చేశారు. రాణిసతీజీ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– ఆదిలాబాద్

సౌత్‌జోన్ జూడో పోటీల్లో మనోళ్ల సత్తా

- క్రీడా పాఠశాల విద్యార్థులకు పతకాలు



ట్రోఫీతో క్రీడాకారులు

ఆదిలాబాద్: సౌత్‌జోన్ జూడో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. కేరళలోని త్రిస్సూర్‌లో జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ప్రారంభమైన మూడో ఖేలో ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడి యంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెం దిన ఐదుగురు క్రీడాకారులు ఐదు పతకాలు కొల్లగొట్టారు. అండర్–15 విభాగంలో మైనస్ 57 కేజీల ఈవెంట్లో అలేఖ్య, మైనస్ 52 కేజీల ఈవెంట్లో ఎస్.రమ్య బంగారు పతకాలు, మైన స్ 44 కేజీల ఈవెంట్లో జీ సహస్ర కాంస్య, అం డర్–18 విభాగంలో మైనస్ 44 కేజీల ఈవెం ట్లో ఎస్.పూజిత, మైనస్ 57 కేజీల ఈవెంట్లో ఆర్.చాందిని బ్రాంజ్‌మెడల్స్ సాధించారు. అండర్–15 విభాగంలో తెలంగాణ క్రీడాకారు లు మూడు బంగారు పతకాలు, రెండు రజతాలు, ఒక కాంస్య పతకంతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని కోచ్ రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాట్స్ డిప్యూటీ డైరె క్టర్ (టెక్నికల్) ధనలక్ష్మి, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ట్రైబల్ వెల్ఫేర్ క్రీడల అధికారి కే పార్థసారధి, క్రీడా పాఠశాల హెచ్‌ఎం వజ్రమాల పతకాలు సాధించిన జూడో క్రీడాకారులు, కోచ్ రాజుకు అభినందనలు తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సర్ఫరాజ్ సూచించారు. గురువారం మండలంలోని అం కోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖండాల, ఖానాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇచ్చారు. ఏడుగురు గర్భిణు లకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. కార్యక్ర మంలో ల్యాబ్ టెక్నీషియన్ మడావి శ్రీనివాస్, ఫార్మసిస్ట్ అలం, హెల్త్ సూపర్ వైజర్లు వసం త, బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, కొడప యశోద తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీ జాబితాలో చేరుస్తామంటేనే మద్దతు'



సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: మాలీలను ఎస్టీ జాబితాలో చేరుస్తామనే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్య క్షుడు సుకుమార్ పెట్కులే పేర్కొన్నారు. గురు వారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వ హించిన సంఘం క్రియాశీల కార్యకర్తల సమావేశా నికి ఆయన హాజరై మాట్లాడారు. 22 ఏళ్ల పోరాట ఫలితంగా మాలీలకు ఎస్టీ హోదా కల్పనకు అసెం బ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపినా ఇంకా పెండిం గ్‌లోనే ఉందని తెలిపారు. మాలీలది సామాజిక సమస్య అని, రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు మాలీలకు ఎస్టీ హోదా కోసం పాటుపడాలని కోరారు. పార్లమెంట్‌లో పెండింగ్ లో ఉన్న బిల్లును ఆమోదించేలా కృషి చేసి మాలీలకు సామాజిక న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం వచ్చే ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 250 గ్రామాల్లో నివసిస్తున్న మాలీలు ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన హామీ కోసం డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా అధ్యక్షుడు వాడగూరే విజయ్, యువ జన విభాగం అధ్యక్షుడు అంబాదాస్ షిండే, ధనం జయ ప్రధాన్, మురళీధర్ నాగోశే దాసు షిండే, వామన్ ప్రధాన్, జనార్దన్ మాందాడే, శ్రీను ఆచారి, కిషన్ సోనులే తదితరులు పాల్గొన్నారు.

'సనాతన ధర్మాన్ని కాపాడే పార్టీలనే గెలిపించాలి'



మాట్లాడుతున్న నాయకులు

బోథ్: ఛత్రపతి శివాజీ ఆశయాలు, ఆకాంక్షలను గౌరవిస్తూ, సనాతన ధర్మాన్ని గౌరవించే పార్టీలనే గెలిపించాలని అఖిల భారత మరాఠా మహాసంఘ్ నాయకులు కోరారు. గురువారం మండలంలోని సొనాల గ్రామంలో పర్యటించారు. ధర్మ సమా జాన్ని కాపాడే వారికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత మరాఠా మహాసంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు సుదేశ్‌పాటిల్, నాయకుడు శ్రీనివాస్ గర్గే తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఇం గ్లిష్ (టీజీటీ) సబ్జెక్ట్ బోధించేందుకు అధ్యాపకులు కావాలని ప్రిన్సిపాల్ ఉమేశ్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీఈడీలో ఇంగ్లిష్ మెథ డాలజీ, టెట్ క్వాలిఫై అయి ఉండాలన్నారు. ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'సొంత నిర్ణయాలు ప్రకటించడం సరికాదు'

ఎదులాపురం: అడహక్ కమిటీని సంప్రదించకుండా సొంత నిర్ణయాలు దత్తాత్రి ప్రకటించడం సరికాదని రజక సంఘం అడహక్ కమిటీ నాయకుడు సంతోష్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్ల బ్‌లో మాట్లాడారు. దత్తాత్రి ఓ రాజకీయ పార్టీకి మద్దతు తెలపడాన్ని ఖండిస్తున్నామన్నారు. నాయ కులు రాజేశ్వర్, జ్ఞానేశ్వర్, లింగన్న, అంజన్న, గం గాధర్, వెంకటేశ్, రమేశ్, గణేశ్, పోచన్న ఉన్నారు.

క్లుప్తంగా

ఒకరిపై కోడ్ ఉల్లంఘన కేసు

భైంసాటౌన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. బుధవారం రాత్రి ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పట్టణంలోని రాంలీలా మైదానం సమీపంలో ప్రచారం నిర్వహిస్తున్నారని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి సమాచారమిచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం పట్టివేత


మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సిబ్బంది

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది గ్రామంలో గురువారం ఎక్సైజ్‌శాఖ అధికారుల దాడుల్లో రూ.16800 విలువ గల మద్యం లభ్యమైంది. సమాచారం మేరకు నక్క రాజు అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా 140 మద్యం సీసాలు దొరికాయని ఎక్సైజ్ సీఐ రాజమౌళి తెలిపారు. సీసాలను స్వాధీనం చేసుకొని నక్కరాజుపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ కుమార్, సిబ్బంది కార్తీక్, మహమ్మద్, మౌనిక పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత దాడులు

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్, నర్సింగాపూర్, అంబారిపేట్, పెద్దూర్‌తండాల్లోని గుడుంబా స్థావరాలపై గురువారం ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు లీటర్ల గుడుంబా, 2500 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై జె.రమేశ్ పేర్కొన్నారు. ఇందులో సిబ్బంది సాయి, గౌతం, కల్పన, రవీందర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం


మంటలో కాలిన నగదు

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన ఆర్సం శేఖర్ ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. గురువారం మధ్యాహ్న సమయంలో ఇంట్లోని విద్యుత్ మీటర్ ఒక్కసారిగా పేలి మంటలు చేలరేగాయి. ఇంట్లోని ఇన్వర్టర్ బ్యాటరీ సైతం పేలడంతో మంటలు వేగంగా ఇంటికి అంటుకున్నాయి. స్థానికులు నీళ్ల చల్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఖానాపూర్ నుంచి ఫైర్‌ఇంజన్ వచ్చి పూర్తిగా మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదంలో భూమి కొనుగోలు చేసేందుకు బీరువాలో దాచిన రూ.4లక్షలు, మరో ఆరు లక్షల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

ముగ్గురికి గాయాలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మున్సిపాలిటీ పరిధిలో ని బీట్‌బజార్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాజేశ్, లక్సెట్టిపేటకు చెందిన శుషాంత్, మంచిర్యాలకు చెందిన సంతోశ్ ద్విచక్ర వాహనంపై స్థానిక బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్‌వైపు వెళ్తుండగా బీట్‌బజార్ వద్దకు వెళ్లగానే ఆగి ఉన్న కారును ఢీకొన్నారు. బైక్ అదుపుతప్పి కిందపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి.

మూడు తోవల పోతున్నరు!



నిర్మల్: 'రాం రామే.. రాజన్న. ఏం సంగతే. ఇయ్యాల్ల పొద్దెక్కుతున్న ఓళ్లస్తలేరు.. సలిగూడ రెండొద్దుల సంది జరంత ఎక్కనే ఉన్నదే. గిలాసాల గింత గరం గరం చాయ్ వొయ్యే..' అంటూ భోజన్న పక్క టేబుల్ మీద ఉన్న న్యూస్‌పేపర్‌ను తీసుకుని బెంచీ మీద కూసున్నడు.

'ఏం జెప్పుమంటవే.. మొన్న రెండ్రోజులుగ రెండు పార్టీలోళ్లు దావత్ ఇచ్చి పోయింద్రు గదనే.. నిన్న రాతిరి ఇగ ఈ పార్టోళ్లు గూడ మందు పంపినుండే. అది తాగుడు ఒడిసే సరికి రాతిరి బారా ఏక్ బజే అయ్యిందే. ఇంటికోయి బుక్కెడుబువ్వ గూడ తినలేదే. పండేసరికి రెండైంది. ఇగ నాకంటే హోటలు తీసుడు ఉంటదని పొద్దుగల్లనే లేసిన. మనోళ్లకు ఇంక రాతిరిది దిగనట్లున్నదే..' అని హోటల్ రాజన్న రాతిరి జరిగిన ముచ్చట చెప్పిండు.

'ఆవే భోజన్న.. నాకు తెల్వక అడుగుతున్న. ఏ పార్టోళ్లచ్చినా మనూళ్లే మస్తు పబ్లికు అస్తున్నరు.. అందరికీ జై గొడుతున్నరు.. ఆడోళ్లు మంగళారతులు పడుతున్నరు. ఆఖిరికి యాడి కోతదో.. ఓళ్లను గెలిపిస్తరోనే..!' అని పాలు మరగవెట్టుకుంట మల్ల రాజన్ననే అన్నడు.

'అరె.. నువ్వు గమ్మతు మాట్లాడుతవేందే రాజన్న.. ఇగ ఊళ్లెకు పెద్దమనిషి అచ్చినంక సూడతందుకైన ఊరోళ్లు రారాయే.. అందరితోని మంచిగుండాల్నె బాపు. రేపు ఓళ్లు గెలుస్తరో తెలవ్వది.. ఓళ్లతోని పనివడతదో తెలుస్త దాయే..' అని భోజన్న చెప్పుకచ్చిండు. ఇంతల.. నిర్మలక్కడికెళ్లి బైకు మీద గంగాధర్ సార్ అచ్చిండు. రాజన్న హోటల్ కాడ బండి ఆపి.. 'ఏం భోజన్న నమస్తే.. ఏమంటుండు మన రాజన్న. మనూళ్లే గాలి ఎటున్నదే మరి..?' అనుకుంట అచ్చి బెంచీ మీద కూసున్నడు.

'ఏమో సార్.. ఈసారి ఓట్లల ఎటూ చెప్పస్త లేదు. మనూరోళ్లు ఓళ్లకు ఓట్లు గుద్దతరో తెలుస్త లేదు. అన్ని పార్టీలకు తిరుగుతున్నరు. అందరికాడికి పోతున్నరు. ఏమిచ్చినా తీసుకుంటున్నరు..' అని భోజన్న చెప్పిండు. 'సార్.. మనూళ్లే గాలి ఎటుంటదో చెప్పలేం గన్ని.. గ కేసీయారు, రేవంతంరెడ్డి, ప్రియాంకగాంధీ, మోదీ సారు.. గీళ్లంతా గాలి మోటర్లల మస్తు అస్తున్నరు. మనక్కడ బాగ దిరుగుతున్నరు. దినాం టీవీలల్ల కనవడే పెద్ద పెద్దోళ్లు మన కండ్లముంగట కనిపించే సరికి గమ్మతనిపిస్తుంది. గిట్ల ఎప్పుడు రాలే సారు. పార్టీల ముచ్చటేందో గన్ని.. గ పెద్దోళ్లను సూడతందుకే మస్తు మంది పోతున్నరు.' అని రాజన్న ఉడుకుతున్న చాయ్‌ను కలుపుకుంట ముచ్చట పెట్టిండు.

'ఆ.. ఏమున్నది రాజన్న ఎన్నికలన్నంక ఓళ్ల పార్టీని గెలిపించుకునేతందుకు ఆళ్లు అస్తనే ఉంటరు. యాడనో ఢిల్లీల ఉండేటోళ్లు.. మన గల్లీ కాడి దాకా ఏంటికస్తరంటవ్..? ఓట్ల కోసమే గదా. ఈసారి మన రాష్ట్రంల ఎన్నికలు ఓళ్లకో ఒక్కళ్లకు అన్నట్లు లేవు. అందుకు గ పెద్దలీడర్లు అస్తున్నరు..' అని గంగాధర్ సార్ చెప్పిండు.

'సార్.. మనూరి సంగతి ఇడిసిపెట్టుండ్రి.. మన జిల్లల గాలి ఎటుంటది.. ఓళ్లు గెలిసేటట్టున్నరు..' అని అప్పుడే చేసిన గోల్డన్ చాయ్ సార్ చేతికందిస్తూ రాజన్న అడిగిండు. 'ఏమో.. రాజన్న మనూళ్లే ఉన్నట్లనే జిల్లాల గూడ గదే ముచ్చటున్నది. ఓళ్లకేం చెప్పస్త లేదు. అన్ని పార్టీలోళ్లు మస్తు తిరుగుతున్నరు. మస్తు కర్సువెడుతున్నరు. అన్ని నియోజకవర్గాలల్ల ఓట్లు ఎటువడుతయో ఇప్పుడైతే చెప్పుడు కష్టంగనే ఉన్నది. ఏ పార్టీకాపార్టీ గట్టిగనే కష్టపడుతున్నయ్. సగం, సగం చెబుదామంటే.. మూడో పార్టీ గూడ నేనేం తక్కువనా.. అన్నట్టున్నది. ఓళ్లు గెల్సినా గొన్ని ఓట్లతోనే గెలుస్తరనైతే అంటున్నరు..' అని గంగాధర్ సార్ వివరించిండు.

ఇంతలో.. రాజన్న హోటల్ కాడికి నర్సయ్య అచ్చిండు. 'సార్.. మీరన్ని తెల్సినోళ్లు. దినాం నిర్మల్ల సార్లతోని తిరుగుతరు గదా.. మరి ఏ పార్టీవోల్లకు ఓటేస్తే మంచిదంటరు..' అని నర్సయ్య అడిగిండు. 'సూడు నర్సన్న.. ఓటనేది ఒకళ్లు చెప్తే ఏసేది గాదు. మనమే మంచిగ ఆలోచించుకుని ఏయాలే. ఇయ్యాల్ల ఏ పార్టీ ఏమంటున్నది.. ఏ అభ్యర్థి ఏం జెపుతున్నడు.. అన్నది సూడాలె. గాలి ఎటుంటే అటు పోవుడు గాదు. మన మంచిచెడ్డలకు, మన పిల్లగాండ్ల కోసం పనికొచ్చెటోళ్లకు ఓటేయ్యాలె. సూడు.. ఇప్పుడు నిల్సునోళ్లల నీకు సై అనిపించినోళ్లకు ఓటేయ్. నేను జెప్పినోళ్లకో.. ఇంకొక్కళ్లు చెప్పినోళ్లకో ఓటేసుడు కరెక్టు గాదు. నీది నువ్వే ఆలోచించాలె. అసలైన పనిమంతుడికి ఓటెయ్యాలె..' అని గంగాదర్ సార్ వివరించిండు. ఆయన మాట్లాడినంత సేపూ.. రాజన్న హోటల్ కాడ ఉన్నోళ్లందరూ మంచిగ ఇన్నరు.

'సారు.. మంచిగ చెప్పిండ్రు. ఇయ్యాళ్ల పైసలిస్తుండ్రని, మందు పోస్తున్నరని ఆశ పడితే.. ఐదేండ్ల ముచ్చట ఉత్తదే అయితది..' అని నర్సన్న రెండు చేతులు జోడించిండు. ఇంతలనే బడికి టైం అయితుందని.. గంగాధర్ సార్ బండి తీసుకుని వాళ్లందరికీ రాంరాం చెప్పి బడికి పోయిండు. ఇగ అక్కడునోళ్లందరు మల్ల రోజటి లెక్కనే ఊరి కాడికెళ్లి మొదలువెడితే.. పట్నం దాకా రాజకీయాల ముచ్చట్ల పడ్డరు.

వేసిన ఓటు చూసుకోవాలా...!

- ఈవీయంలో ఓటుమీట నొక్కిన తర్వాత అవకాశం
- వీవీప్యాట్‌లో ఏడు సెకండ్ల పాటు డిస్‌ప్లే..


వీవీప్యాట్ యంత్రం

నిర్మల్‌ఖిల్లా: గతంలో బ్యాలెట్ పేపరుపై స్వస్తిక్ ముద్రను వేస్తేనే ఓటు వేసినట్లుగా అధికారికంగా చెల్లుబాటయ్యేది. స్వస్తిక్ ముద్ర రెండు గుర్తుల మధ్యలో రావడం, పక్కన ముద్రణ కావడం జరిగితే ఆ ఓటు చెల్లకుండా పోయేది. కానీ ప్రస్తుత ఎన్నికల్లో పూర్తిస్థాయిలో ఈవీఎంల వాడకం మొదలు కాగా అదనంగా పూర్తి పారదర్శకతతో ఉండేందుకు వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టారు. ఎన్నికల కమిషన్ జవాబుదారీతనాన్ని పెంచేందుకే ప్రస్తుత ఎన్నికల నిర్వహణలో వీటికి పెద్దపీట వేస్తోంది. అయితే ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత సరైన గుర్తింపు కార్డుతో, ఓటర్ లిస్టులో పేరు సీరియల్ నంబరు ప్రకారం పోలింగ్ అధికారులు ఈవీఎం క్యాబిన్‌కు అనుమతిస్తారు. అక్కడే ఓటు వేయాల్సి ఉంటుంది. వేసిన ఓటు అక్కడే ఈవీఎంకు అనుసంధానించబడి ఉన్న వీవీప్యాట్ యంత్రంలో 7సెకండ్ల పాటు ఏ పార్టీ గుర్తుకు ఓటు వేశామో ప్రింట్‌తో సహా ముద్రించి కనిపిస్తుంది. తర్వాత దానంతట అదే వీవీప్యాట్‌లోని ప్రత్యేక డ్రాప్ బాక్స్‌లో పడిపోతుంది. మనం వేసిన ఓటు సరైన గుర్తుకే వేశామా.. లేదా.. అన్నది అక్కడే మనకు స్పష్టంగా రూఢీ అవుతుంది. ఈ యంత్రాన్ని తొలిసారిగా నాగాలాండ్‌లోని లోక్సన్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2013 లో ఉపయోగించారు.

పోస్టల్ బ్యాలెట్ మిస్సింగ్

- ఉద్యోగుల్లో కలవరం..

కైలాస్‌నగర్: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బందికి అందించే పోస్టల్ బ్యాలెట్ మిస్సింగ్ అవ్వడం ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే ఎన్నికల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12 ద్వారా ఇదివరకే దరఖాస్తు చేసుకున్నారు. దీని దరఖాస్తు గడువు ఈ నెల 8వ తేదీన ముగిసింది. అయితే పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు 15 మంది కార్యాలయాలకు వెళ్లగా మీ దరఖాస్తులు అందలేదని సిబ్బంది చెప్పడంతో విస్తుపోయారు. తాము ఇదివరకే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు అందలేదని అధికారులను ప్రశ్నించగా, వారినుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో ఏం చేయాలో తెలియక వారు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమని చెప్పే అధికారులు ఇలా తాము చేసుకున్న దరఖాస్తులను ఇంత నిర్లక్ష్యంగా పట్టించుకోకపోవడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లాలో ఎన్ని ఓట్లు నమోదయ్యాయి. ఎన్ని గల్లంతయ్యాయనే సమాచారం కోసం కలెక్టరేట్ పర్యవేక్షకురాలు జాడి స్వాతిని సంప్రదించగా.. ఎలాంటి పోస్టల్ బ్యాలెట్ మిస్ అవ్వలేదని పేర్కొన్నారు. అయితే ఇంకా దరఖాస్తులు అందాల్సి ఉందని, అవి పూర్తిస్థాయిలో వస్తే తప్పా ఎన్ని వచ్చాయి.. ఎన్ని రాలేదనే సమాచారం చెబుతామని పేర్కొనడం గమనార్హం.

ఓటు.. పలు రకాలు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికలు అంటేనే అందరికి గుర్తుకు వచ్చేది ఓట్లు. ఐదేళ్ల పాలించే నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటుహక్కు తప్పనిసరి. ఎన్నికలు వ చ్చాయంటే చాలు ఓటర్ల జాబితాలో తమపేరు ఉందో లేదో అని అందరూ ఓసారి సరిచూసుకుంటా రు. అయితే ఓటుహక్కు కలిగి ఉండి పోలింగ్ బూత్ నుంచి తిరిగి బయటికి వేలికి సిరా వేసుకుని వచ్చేటప్పుడు ఓటరు మొహంలో ఎనలేని ఆనందం కని పిస్తుంది. అదే కొత్త ఓటరు అయితే ఆ ఆనందం రె ట్టింపు అవుతుంది. అయితే ఓట్లలో పలు రకాలు ఉంటాయని చాలామందికి తెలియదు. ఓట్లలో వివి ధ రకాలు ఉంటాయి. వివిధ హోదాల్లో వీటిని విని యోగించుకోవచ్చు. ఒకసారి వాటిని పరిశీలిస్తే..

సాధారణ ఓటు...

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించింది. ఇలా ఓటు హక్కును పొందినవారు తమకు నచ్చిన నేతకు ఓటు వేసుకునే అవకాశం ఉంది. బూత్‌లోకి వెళ్లి మామూలుగా ఓటువేస్తే దాన్ని సాధారణ ఓటు అంటారు.

పోస్టల్ బ్యాలెట్...

ఎన్నికలు సజావుగా కొనసాగాలంటే చాలామంది ఇందుకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఓటు వేసేందుకు గ్రామాలకు పట్టణాలకు వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోలేరు. ఇందుకు ఎన్నికల సంఘం ఉద్యోగులు, అధికారుల కోసం పోస్టల్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారికి నచ్చిన వారికి ఓటు వేసి ఎన్నికల అధికారులకు ముందుగానే పంపించవచ్చు.

సర్వీస్ ఓటు

దేశ రక్షణలో భాగంగా చాలామంది సైనికులు, పారామిలటరీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోలేరు. తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం వీరికి వెసులుబాటు కల్పించింది. వీరిని సర్వీసు ఓటర్లుగా గుర్తించి.. వారి కోసం ప్రత్యేకంగా సర్వీసు ఓటును కల్పించింది. వీరు సర్వీస్‌లో ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయవచ్చు.

ప్రాక్సీ ఓటింగ్..

కేంద్ర నిఘా సంస్థలు, గూఢాచారి సంస్థల సిబ్బంది తమ ఉనికిని మరెవరికి తెలియనీయకుండా గోప్యంగా ఉంటారు. వారు తన ప్రతినిధిగా మరెవరినైనా పంపించి ఓటు వేయవచ్చు. ఈ విధమైన ఓటు హక్కునే ప్రాక్సీ ఓటు హక్కు అంటారు. వారు స్థానికంగా లేనందున ఓటు వేసేందుకు ఒక ప్రతినిధిని అధికారులు అనుమతిస్తారు. వీరిని క్లాసిఫైడ్ సర్వీసు ఓటరుగా గుర్తిస్తారు. నియోజకవర్గం, పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాక్సీఓటరు వివరాలపై ఆర్ ద్వారా ప్రిసైడింగ్ అధికారికి ముందే సమాచారం అందుతుంది. సర్వీసు ఓటరు తరఫున వచ్చే ప్రాక్సీ ఓటరు ఆ పోలింగ్ బూత్ పరిధిలోని మిగతా ఓటర్ల మాదిరిగానే ఓటు వేస్తారు. అయితే సాధారణ ఓటరుకు కుడి చేతికి సిరాచుక్క పెడితే.. ప్రాక్సీ ఓటరుకు మధ్య వేలికి చుక్క పెడతారు. ఏమంటే.. ఆయన తన సొంత ఓటు వేసినప్పుడు చూపుడు వేలికి సిరాచుక్క పెట్టాల్సి ఉంటుంది. కాగా, ప్రాక్సీ ఓటరు తన ఓటు కాక ఒకరికి మాత్రమే ప్రాక్సీగా ఓటు వేయడానికి అవకాశం ఉంటుంది.

ఓటు

గుర్తింపు విషయంలో అధికారులకు సందేహం కలిగినా, ఏజెంట్లు అభ్యంతరం చెప్పినా సదరు ఓటరు తన గుర్తింపును చాలెంజ్ చేసి రుజువు చేసుకోవాలి. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఓటు వేయడానికివచ్చినప్పుడు అతడి పేరు తప్పు చెబుతున్నాడని ఏజెంట్ అభ్యంతరం చెబితే ఓటరు, ఏజెంట్‌ను ప్రిసైడింగ్ అధికారి వద్దకు పంపుతారు. అభ్యంతరం చెప్పి ఏజెంట్ నుంచి రూ.2 చాలెంజ్ ఫీజు తీసుకుని ఓటరు వద్ద ఉన్న ఇతర గుర్తింపు వివరాలు అధికారులు పరిశీలిస్తారు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే స్థానిక బీఎల్వీను పిలిచి ఆరా తీస్తారు. ఓటరై జాబితాలో ఉన్న పేరు సరైందే అయితే.. వయసు, తండ్రి పేరు, చిరునామా లాంటి విషయాల్లో తేడా ఉన్నా పెద్దగా పట్టించుకోరు. అప్పుడు ఏజెంట్, ఓటరు ఇద్దరిలో ఎవరి వాదన సరైందని తేలితే వారిని వదిలి మిగతా వారికి ప్రిసైడింగ్ అధికారి మొదటిసారి హెచ్చరిక జారీ చేస్తారు. లేదా ఏజెంట్, ఓటరును అక్కడే పోలీసులకు అప్పగించొచ్చు. ఇక ఏజెంట్ చాలెంజ్ చేస్తే అతడిని బయటకు పంపించే అధికారం ప్రిసైడింగ్ అధికారికి ఉంటుంది.

టెండర్ ఓటు...

ఓటరు ఓటు వేయడానికి వచ్చేసరికి అతడి ఓటు ఇంకెవరో వేసిన సందర్భాలుంటాయి. అయితే సదరు ఓటరు వివరాలను ప్రిసైడింగ్ అధికారి పరిశీలించి.. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే.. ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపరు ద్వారా ఓటుకు అవకాశం కల్పిస్తారు. దీనినే టెండర్డ్ ఓటు అంటారు. ప్రతి పోలింగ్ బూత్‌కు పార్లమెంట్, శాసనసభకు సంబంధించి 20చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఓటు వేశాక కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తే.. దాని వెనుక టెండర్ బ్యాలెట్ అని రాస్తారు.

లంబాడాలంతా ఏకం కావాలి

- బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

కడెం: లంబాడాలంతా ఏకమై బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్, టీఎస్‌ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బంజార జాతికి సముచిత స్థానం కల్పించిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలన్నారు. ఇందులో


మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, హపావత్ రాజేందర్ నాయక్, భుక్యా కిషన్‌నాయక్, భుక్యా రమేశ్ నాయక్, సర్పంచ్‌లు సురేశ్‌నాయక్, భరత్‌చౌహన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నీలాదేవేందర్, తదితరులున్నారు.

మాయ మాటలతో నమ్మించి..

- వృద్ధురాలి మెడలోని బంగారం చోరీ

నిర్మల్‌రూరల్: మాయమాటలతో నమ్మించి ఓ వృద్ధురాలి నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలను దొంగిలించిన ఘటన మండలంలోని తలువేద గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం... తలువేద గ్రామానికి చెందిన గాండ్ల చిన్నమ్మ అనే వృద్ధురాలు గురువారం ఇంట్లో ఒంటరిగా ఉండగా మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వచ్చాడు. మాటమాట కలిపి ప్రభుత్వం నుంచి నీకు లోన్ వచ్చిందని, మెడలో బంగారు ఆభరణాలు ఉంటే అధికారులు లోన్ ఇవ్వరని నమ్మించాడు. ఒంటిపైన ఉన్న నాలుగున్నర తులాల పుస్తెలతాడు, బంగారు చైన్ తీసి ఇంట్లో దాచమని చెప్పాడు. అగంతకుడి మాటలు నమ్మిన చిన్నమ్మ బంగారు ఆభరణాలు తీసి అతడి చేతికి ఇచ్చింది. వాటిని రిఫ్రిజిరేటర్‌లో పెడుతున్నట్లు నాటకమాడి మాయమాటలతో బంగారాన్ని తీసుకొని పారిపోయాడు. తేరుకున్న చిన్నమ్మ బయటకు వచ్చి గ్రామస్తులకు తెలుపడంతో వారు కొద్ది దూరం వెళ్లి వెతకగా అగంతకుడి ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి నిర్మల్ కోర్టు జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్‌కు చెందిన కుదరత్ అలీ ఖాళీ సీసాలు ఏరుకుంటూ జీవించేవాడు. 11 అక్టోబర్ 2017న స్థానిక నాయుడువాడలో బాలిక ఇంటి ఎదుట ఆడుకుంటుంది. సీసలేరుకుంటున్న అలీ ఆ బాలిక దగ్గరకు వచ్చి ఖాళీ సీసాలు సంచిలో నింపుదామని చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడగా బాలిక కేకలు వేసింది. సంతోష్ అనే వ్యక్తి కేకలు వినీ అక్కడికి వెళ్లగా అలీ పారిపోయాడు. బాలిక తల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సైలు హరిబాబు, బాలకృష్ణ కేసు నమోదు చేసి అలీని అరెస్టు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు రమణారావు, విశ్వాస్‌రెడ్డి తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో కుదరత్ అలీకి మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ.. జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ గురువారం తీర్పునిచ్చారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై జి.లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో నివాసం ఉండే మర్తురి వెంకయ్య(50) సత్తనపల్లి గ్రామానికి పని మీద ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తున్నాడు. కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన వెంకయ్య స్థానికంగా మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెంకయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు యేసురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వెంకయ్య మృతదేహం

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

- బాధితుడి ఇంటిఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన

లక్ష్మణచాంద: వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన ఒడిషెల చిన్న భోజన్న బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. మూడేళ్లుగా అతడి భార్య నాగమణి(35) ఇద్దరు కుమారులతో కలిసి తల్లిగారింటి వద్ద నిర్మల్‌లోని బెస్తవార్‌పేట్‌లో నివాసం ఉంటోంది. పార్‌పెల్లి గ్రామానికి చిలుక వంశీ అనే వ్యక్తి నాగమణిని కొద్ది రోజులుగా చరవాణిలో లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో నాగమణి రెండు రోజుల కిందట పార్‌పెల్లి గ్రామానికి చెందిన చిలుక వంశీ తనను ఫోనులో వేధింపులకు పాల్పడుతున్నాడని తల్లితో చెప్పింది. ఇదే క్రమంలో బుధవారం ఉదయం 10గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఇంటికి వచ్చిన తల్లి కళావతికి కుమార్తె ఉరేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి కళావతి ఫిర్యాదు మేరకు నిర్మల్‌టౌన్‌లో కేసు నమోదు చేశారు.


పార్‌పెల్లిలో ఆందోళనలో కుటుంబ సభ్యులు

నాగమణి (ఫైల్)

పార్‌పెల్లిలో ఆందోళన..

నాగమణి మృతదేహాన్ని పార్‌పెల్లికి అంత్యక్రియల కోసం తీసుకొచ్చారు. ఇదే క్రమంలో వంశీ అనే వ్యక్తి లైంగికంగా వేధింపులకు గురిచేయడంతోనే నాగమణి ఆత్మహత్య చేసుకుందని అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని బంధువులు అతడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్, సోన్ సీఐ నవీన్ కుమార్ చేరుకుని పార్‌పెల్లిలో గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

భార్య మృతితో ఇంటికి వచ్చిన భర్త...

నాగమణి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిందని విషయం తెలవడంతో భర్త చిన్న భోజన్న దుబాయ్ నుంచి గురువారం ఉదయం స్వగ్రామం చేసుకొన్నాడు. దీంతో తన ఇద్దరు కుమారులు శ్రీచరణ్(12), శ్రీవర్ధన్(10)తో కలిసి భార్య మృతదేహం వద్ద రోదించిన తీరు స్థానికులను కలచివేసింది. ప్రస్తుతం ఆందోళన కొనసాగిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండలంలోని నర్సాపూర్‌కు చెందిన టేకం అజయ్(35) భార్య కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో తిర్యాణి మండలం చోపిడికి చెందిన వితంతువు ఆత్రం పోచుబాయిని రెండో వివాహం చేసుకున్నాడు. చోపిడిలోనే నివాసం ఉంటూ కైరిగూడ ఓసీపీలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా నెలరోజుల క్రితం దంపతులిద్దరూ ఆత్మహత్యకు యత్నించారు. ఈ క్రమంలో ఈ నెల 18న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అజయ్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం రెబ్బెన మండలం సోనాపూర్ గ్రామ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మూడు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.